

'శాలివాహన' మూసివేత
ఆందోళనలో కార్మికులు

- నష్టాల పేరుతో కంపెనీని ఎత్తివేసే యత్నం
- భూముల ధరలు పెరగడంతో యాజమాన్యం కుట్ర
- కంపెనీ ఎదుట రిలే దీక్షలకు పూనుకున్న కార్మికులు

మంచిర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాత మం చిర్యాలలో గల శాలివాహన విద్యుత్ ప్లాంటును యాజ మాన్యం ఒక్క సారిగా మూసివేయడంతో కార్మిక కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ప్లాం టుపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కంపెనీలో తయారయ్యే విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్ర యించేందుకు యాజమాన్యం కుదుర్చుకున్న పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) ముగియడంతో ఇదే అదునుగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మాత్తుగా లాకౌట్ చేయడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

● కొనసాగుతున్న రిలే దీక్షలు

కార్మికుల వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం వేధిస్తుండటంతో విధిలేని పరిస్థితుల్లో కార్మికులు ఆందోళనబాట పట్టారు. కంపెనీ ఎదుట మూకుమ్మడిగా రిలే దీక్షలకు పూనుకున్నారు. 12 రోజులుగా ప్లాంటు ఎదుట పడిగాపులు కాస్తున్నారు. ఒక దశలో కార్మికులను చర్చలకు ఆహ్వానించిన యాజమాన్యం తలో లక్ష రూపాయలు చెల్లిస్తాం కంపెనీని వదిలి వెళ్లాలని హుకుం జారీ చేసింది. ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.



ప్లాంటు ఎదుట రిలేదీక్షలు చేస్తున్న కార్మికులు

● 2002లో ఉత్పత్తి ప్రారంభం

శాలివాహన గ్రీన్‌ఎనర్జీ లిమిటెడ్ పేరుతో ఆరు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో బయో మాస్ పవర్ ప్లాంటును 2001లో యాజ మాన్యం ప్రారంభించింది. ప్లాంటు ఏర్పాటుకు రైతుల నుంచి 30 ఎకరాల భూమిని కారు చవకగా కొనుగోలు చేసింది. భూములు ఇచ్చిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తామనడంతో రైతులు ఎకరాకు రూ.40 వేల నుంచి రూ. 80వేల వరకు ధరకు విక్రయించారు. అలా ఏర్పడ్డ ప్లాంటులో 2002 డిసెంబర్ 7న వ్యవసాయ వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. గంటకు 6 మెగావాట్ల (గంటలో 6వేల యూనిట్లు) చొప్పున ఉత్పత్తి కాగా, రోజూ తయారైన 1లక్ష 44వేల పైచిలుకు యూనిట్లను యాజమాన్యం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేది. తెలంగాణ ఏర్పడ్డ నుంచి యూనిట్‌కు రూ. 5.30 పైసల చొప్పున టీఎస్ ట్రాన్స్‌కోకు విక్రయించేలా యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వంతో పీపీఏ (పవర్ పర్చేస్ అగ్రిమెంటు)ను 20 సంవత్సరాలకు ఒప్పందం కుదుర్చుకుంది. పీపీఏ గడువు 2022 డిసెంబర్ 7వ తేదీతో ముగియడంతో రెన్యూవల్ చేయించకుండా కంపెనీని యాజమాన్యం లాకౌట్ చేసింది. అప్పటి నుంచి కార్మికులకు వేతనాలు చెల్లించకపోగా, నష్టాలు వస్తున్నందున ప్లాంటును నడపలేమంటూ మూసివేసింది.

● బిల్లుల పెండింగ్ పేరుతో....

భూముల ధరలు విపరీతంగా పెరగడంతో కంపెనీని మూసి వేయాలని యాజమాన్యం ప్రణాళికలు రూపొంచింది. టీఎస్ ట్రాన్స్‌కోకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నప్పటికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో జాప్యం చేస్తుందంటూ యాజమాన్యం వేతనాలు చెల్లించడంలో తాత్సారం చేస్తూ వచ్చింది. నెల బిల్లులు రూ.3 కోట్లతోపాటు ఇంటెన్సివ్ మరో రూ.6 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ క్రమంలో కార్మికులకు వేతనాలు చెల్లించలేమంటూ చేతులెత్తేసింది. 14 నెలలుగా వేతనాలు చెల్లించనప్పటికీ కార్మికులు విధులు నిర్వహించగా, ముడి సరుకుల కొనుగోలుకు పెట్టుబడి లేదని, బిల్లులు విడుదల కానిదే ప్లాంటు నడపలేమని యాజ మాన్యం లాకౌట్ ప్రకటించింది. దీంతో ప్లాంటులో పని చేస్తున్న కార్మికులు రోడ్డునపడ్డారు. ప్లాంటులో అన్ని విభాగాల్లో ప్రత్యక్షంగా 100 మందికిపైగా కార్మికులు పని చేస్తుండగా మరో 500 మంది పరోక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

ప్లాంటు ఏర్పాటుకు భూములిచ్చాం

- నిమ్మరాజుల సత్యనారాయణ, కార్మికుడు



విద్యుత్ ప్లాంటులో ఉద్యోగం వస్తుందనే ఆశతో భూములు ఇచ్చాం. ఏడు ఎకరాల భూమిని ఎకరాకు రూ. 60వేల చొప్పున అప్పగించాం. ఇన్నాళ్లు ఆధారపడ్డ మాకు ప్లాంటు మూసివేత కారణంగా ఉద్యోగం పోయింది. తిరిగి సాగు చేసేకుందామన్నా భూములు కూడా లేక పోవడంతో కుటుంబాలను ఎలా పోషించాలో తెలియడంలేదు.

రోడ్డున పడిన కుటుంబాలు...

- శెట్టి శ్రీనివాస్, విద్యుత్ ప్లాంటు యూనియన్ నాయకుడు



18 సంవత్సరాలుగా ప్లాంటునే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. వందలాది మంది కార్మికులకు జీవనోపాధి లభిస్తోంది. నష్టాలు వస్తున్నాయనే పేరుతో అకస్మాత్తుగా లాకౌట్ చేయడం సరికాదు. ప్లాంటు మూసివేతతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కార్మికులు కోరిన పరిహారం చెల్లించాలి. లేదంటే ప్లాంటు కోసం సేకరించిన భూములను తిరిగి రైతులకు అప్పగించాలి.

చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

కోటపల్లి, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మంచిర్యాల పట్టణానికి చెందిన పిల్లల వైద్య నిపుణులు రుద్రభట్ల రఘువంశీ (అవని పిల్లల ఆసుపత్రి) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు వంద మంది చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన రఘువంశీతో పాటు వైద్య శిబిరం ఏర్పాటుకు కృషి చేసిన కపిల్‌ను మాజీ ఎంపీటీసీ రాగం స్వామి, గ్రామస్తులు సన్మానించారు.

రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న గుర్తింపు సంఘం నాయకులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలోని పలు కాలనీల్లో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు లేవని ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్‌లు ఆరోపించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2, 3వ జోన్‌లలో చేపట్టిన పనుల్లో కాంట్రాక్టర్ పాత రోడ్డును తొలగించకుండా రోడ్డు వేస్తున్నాడని పేర్కొన్నారు. రూ.1.60 కోట్లతో చేపట్టిన నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు లేకపోతే తొందరగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. గాండ్ల సంపత్, మేకల సంతు, బానయ్య పాల్గొన్నారు.

పథకాలను గ్యారంటీగా అమలు చేస్తాం



మేదరిపేటలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు స్వాగతం, హాజీపూర్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దండెపల్లి, ఫిబ్రవరి 11: ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ప్రజలకు అత్యుత్తమ ప్రజాపాలన అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రివర్గం కృషి చేస్తుందన్నారు. మాదాపూర్‌లో ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీలో వైద్య ఖర్చులకు రూ.10 లక్షలకు పెంపు, గృహలక్ష్మిలో 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. నెలాఖరులోగా రెండు పథకాలు అమల్లోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణిత్రిమూర్తి, ఎంపీటీసీలు నవీన్, శ్రీనివాస్, కమలాకర్, మనమ్మ, మాలిక, మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సతీష్, నాయకులు ప్రవీణారెడ్డి, సత్యంరావు, కాంతారావు, వెంగళరావు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

హాజీపూర్: మండల కేంద్రంలో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పను లకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో సుమారు రూ.2 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలను అమలు చేస్తుందని, అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, నాయకులు శ్రీనివాసరావు, బాలరాజు, శంకర్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

లక్సెట్టిపేటరూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం వెంకట్రావుపేట, కొత్తకొమ్ముగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఉన్న గ్రామాల్లో పనులను పూర్తి చేయి స్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి రోడ్డు, రవాణా సౌకర్యం కల్పిస్తానని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పింగళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ నాగభూషణం, ఎంపీపీ మంగచిన్నన్న, దేవేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ సుజాతసురేష్, సుమన్, కౌన్సిలర్‌లు సురేష్‌నాయక్, సత్తయ్య, కోఆప్షన్ షాహిద్ ఆలీ, చిన్న రమేష్, సతీష్, లింబాద్రి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు

ఏసీసీ, ఫిబ్రవరి 11: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆసిఫాబాద్ తహసీల్దార్ రమేష్ మంచిర్యాలకు బదిలీ చేశారు. తాండూర్ తహసీల్దార్ రోహిత్, మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న జ్యోత్స్నను ఆసిఫాబాద్ బదిలీ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పనిచేస్తున్న శ్రీనివాసరావును, మంచిర్యాల కలెక్టరేట్ సూపరింటెండెంట్ సునీల్‌ను ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. భీమారం తహసీల్దార్ విశ్వంబర్‌ను, మంచిర్యాల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజమనోహర్‌ను జగిత్యాల జిల్లాకు బదిలీ చేశారు. జమ్మికుంట తహసీల్దార్ రజనీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్‌హర్‌రావు తహసీల్దార్ శ్రీనివాస్‌ను మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. బెల్లంపల్లి తహసీల్దార్ సుధాకర్, జన్నారం తహసీల్దార్ వేణుగోపాల్‌ను మంచిర్యాల కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

-నాయబ్ తహసీల్దార్‌ల బదిలీలు

మందమర్రి నాయబ్ తహసీల్దార్ సుమన్‌కుమార్‌ను ఆసిఫాబాద్ జిల్లాకు, బెల్లంపల్లి నాయబ్ తహసీల్దార్ భైరెడ్డి స్వప్న, మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మాధవిని పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. చెన్నూరు నాయబ్ తహసీల్దార్ సంతోష్‌ను కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు, కౌటాల నాయబ్ తహసీల్దార్ రవీందర్‌ను మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. ఆసిఫాబాద్ జిల్లాలోని నాయబ్ తహసీల్దార్ జోగయ్యను మంచిర్యాల, పెద్దపల్లి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు రాజేశ్వర్‌రావు, రవీందర్‌లను మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు.

ఎస్‌ఐల బదిలీలు

రామగుండం కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ మల్టీ జోన్ 1 ఇన్‌చార్జి ఐజీ, రామగుండం ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. మంచిర్యాల ఎస్‌ఐ 2గా విధులు నిర్వహిస్తున్న రాజేందర్‌ను కోటపల్లి ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. కోటపల్లి ఎస్‌హెచ్‌వో సురేష్‌ను వీఆర్ రామగుండం ఎస్‌ఐగా బదిలీచేశారు. తాండూర్ ఎస్‌హెచ్‌వో రాజశేఖర్‌ను మందమర్రి ఎస్‌ఐ2 గా బదిలీ చేశారు.

ఎంపీడీవోల బదిలీలు

రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీవోలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనిత రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల జిల్లాలో ఎంపీడీవోలుగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్, వరలక్ష్మి, శంకరమ్మ, వేముల మల్లేష్, శ్రీనివాస్, రాజేందర్, పి.సత్యనారాయణలను కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. కె. శ్రీనివాస్, కె. భాస్కర్, కె.నాగేశ్వర్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్‌హై, జవహర్‌లాల్‌లను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఎస్.అరుణరాణిని నిర్మల్ జిల్లాకు, పి. శశికళ, ఎంఏ అలీంలను పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు.

ఆర్యసమాజ్‌లో ప్రేమ వివాహం



ఏసీసీ, ఫిబ్రవరి 11: బెంగుళూర్‌కు చెందిన అమ్మాయి, చెన్నూరుకు చెందిన అబ్బాయి జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో ఆదివారం ప్రేమ వివాహం చేసుకున్నారు. చెన్నూరుకు చెందిన తోకల రాకేష్ బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆఫీస్‌లో పనిచేస్తున్నాడు. గుల్‌బర్గాకు చెందిన ఆర్యకళ బెంగుళూరులో చదువుతోంది. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఆదివారం మంచిర్యాలలోని ఆర్యసమాజ్‌లో వివాహం చేసుకున్నారు. డాక్టర్ అయోధ్య రామయ్య, నర్సయ్య చేతుల మీదుగా న్యాయవాది కొట్టె నటేశ్వర్ ఆధ్వర్యంలో వివాహం జరిగింది.

సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు



మందమర్రిలో బెల్లం తులాభారం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 11 : ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మజాతర సందర్భంగా పలువురు భక్తులు నివాసాల వద్ద వన దేవతలకు మొక్కులు చెల్లిస్తున్నారు. ఆదివారం బెల్లాన్ని తులాభారం వేసేందుకు దుకాణాల ముందు బారులు తీరారు. ఆయా కాలనీల నుంచి ప్రజలు మార్కెట్ సెంటర్‌లోని దుకాణాల వద్దకు వచ్చి బెల్లం తులాభారం చేయించుకున్నారు. కోళ్లు, మేకలను బలి ఇస్తుండడంతో గిరాకీ పెరిగింది. బెల్లాన్ని కొనుగోలు చేసిన భక్తులు ఆటోలను ఎంగేజ్ చేసుకుని నివాసాలకు తరలివెళ్లారు. బెల్లం తులాభారం చేసే దుకాణాల ముందు ఆటోలు బారులు తీరి కనిపించాయి. ఆటోల్లో బెల్లం బుట్టలను పెట్టుకున్న భక్తులు ఇండ్లకు బయలుదేరి వెళ్లారు.



బెల్లంపల్లిలో బెల్లం తులాభారం చేయించుకుంటున్న భక్తులు

బెల్లంపల్లి: సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో భక్తులు వన దేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం దుకాణాల వద్ద భక్తులు బెల్లం తులాభారం చేయించుకున్నారు. ఇండ్లకు వెళ్లి ప్రసాదంగా పంచి పెట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లో బెల్లం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

మందమర్రిరూరల్: సమ్మక్క సారలమ్మ మొక్కులో భాగంగా ప్రజలు ఇండ్లలో వన దేవతలకు పూజలు నిర్వహించారు అనంతరం మేకలు, కోళ్లను బలిచ్చి బంధుమిత్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా టీజీసెట్



బెల్లంపల్లి కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 11: తెలంగాణ సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో అడ్మిషన్‌ల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదిలాబాద్ రీజియన్‌లోని మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో మొత్తం 8844 మంది విద్యార్థులకుగాను 8422 మంది విద్యార్థులు హాజరు కాగా, 422 మంది గైర్హాజరయ్యారని ఆర్‌సీవో కొప్పుల స్వరూపరాణి తెలిపారు. బెల్లంపల్లిలోని పరీక్ష కేంద్రాలను గురుకులాల అసిస్టెంట్ సెక్రెటరీ వెంకటేశం సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించారు. బెల్లంపల్లిలోని నాలుగు పరీక్ష కేంద్రాలను రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలుద్దీన్ సందర్శించారు. ఆదిలాబాద్ రీజియన్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆర్‌సీవో స్వరూపరాణి తెలిపారు.

వైభవంగా లక్ష్మీదేవర ముత్యాలమ్మ జాతర



అమ్మవారి ప్రతిమలకు జలాభిషేకం

కోటపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని ఏదులబంధంలో ఆదివారం ఆదివాసీ నాయకపోడ్ ఆరాధ్యదైవాలైన లక్ష్మీదేవర ముత్యాలమ్మ జాతరను భక్తులు ఘనంగా ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే జాతరలో భాగంగా మొదటి రోజు పల్లకిలో అమ్మవార్ల విగ్రహాలను తీసుకుని పారుపెల్లి వద్ద గోదావరి నదికి కాలినడకన చేరుకున్నారు. అనంతరం అక్కడ అమ్మవారి ప్రతిమలకు నది జలాలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, పట్నాలు వేశారు. తిరిగి ఏదులబంధం చేరుకోగా సోమవారం అమ్మవార్లకు బోనాల సమర్పణ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని మాజీ ఎంపీటీసీ జేక శేఖర్ కోరారు.

నేటి నుంచి లక్ష్మీదేవర బోనాల జాతర



ఆలయంలోని లక్ష్మీదేవర

చెన్నూరు, ఫిబ్రవరి 11: చెన్నూరులోని బట్టిగూడెం పాత బస్టాండ్ కాలనీలోని లక్ష్మీదేవర ఆలయంలో సోమవారం నుంచి బోనాల జాతర ప్రారంభం కానుంది. యేటా మాఘమాసంలో జాతర నిర్వహించడం ఆనవాయితీ. రెండు రోజులపాటు జాతరను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పంటలు చేతికి వచ్చిన తర్వాత ముదిరాజ్ కులస్తులు లక్ష్మీదేవరకు బోనాలతో మొక్కులు సమర్పించుకొంటారు. గోలేటి అమ్మవారి నివాస ప్రాంతమని ఐదేండ్లకు ఒకసారి బోనాల జాతరకు రెండు నెలల ముందుగా అమ్మవారిని కాలినడకన అక్కడకి తీసుకు వెళ్తామని అర్చకుడు గిరెల్లిమల్లయ్య తెలిపారు.

-ఆదివారం అమ్మవారు ఆగమనం

ఆదివారం ఉదయం గోదావరిలో జలశుద్ధి అనంతరం గుట్టకు వెళ్లిన లక్ష్మీదేవరను రాత్రి ఆలయానికి తీసుకువస్తారు. అనంతరం రాత్రి ఆటాపాటలు నిర్వహిస్తారు. సోమవారం నుంచి ఆలయ ప్రాంగణంలో ఉదయం పట్నాలు సమర్పిస్తారు. పట్నాలపైకి అమ్మవారు వచ్చిన తర్వాత బోనాల జాతర ప్రారంభమవుతుంది. ఆలయాల ప్రాంగణంలోనే భక్తులు బోనాలు ముస్తాబు చేసి నైవేద్యం సమర్పిస్తారు. జాతరకు మంచిర్యాల, జయశంకర్, భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

ఆలయానికి మాజీ ఎమ్మెల్యే విరాళం



దివాకర్‌రావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏసీసీ, ఫిబ్రవరి 11: మంచిర్యాల పట్టణంలోని నాలుగో వార్డులో నిర్మించిన కాశీ విశ్వేశ్వర అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు రూ.21 వేల విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఆలయంలో నాగేంద్ర సహిత శివలింగ, నందీశ్వర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.8 శాతం నిధులు అంటే రూ. 21,389 కోట్లు కేటాయించిందని తెలిపారు. అలాగే విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్శిటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, యూనివర్శిటీల అభివృద్ధికి కేవలం రూ. 500 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ నిధులు ఎలా సరిపోతాయని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

● మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల16న జరిగే దేశవ్యాప్తసమ్మెను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. బీజేపీ మతతత్వ పాలన వల్ల దేశ ప్రజానీకానికి కార్మిక, కర్షకులకు కాస్తఊరటనిచ్చే రాజ్యాంగంలోని ప్రగతిశీల అంశాలకు ముప్పు ఏర్పడిందన్నారు. ప్రజలు జీవించే హక్కును మోదీ ప్రభుత్వం హరిస్తూ దేశసంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను కుదిస్తూ కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులకు అనుకూలమైన చట్టాలను రూపొందించిందని విమర్శించారు. సంఘ్ పరివార్, హిందూ మనువాద ఆలోచనలతో కులమత వైషమ్యాలను రెచ్చ గొడుతూ దేశభక్తి ముసుగులో అశేష ప్రజానీకాన్ని బలిగొంటుందని ఆరోపించారు. ఆత్మనిర్భర్ భారత్ పేరిట ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. దేశంలో కొత్త ప్రభుత్వరంగ సంస్థలకు, ఉద్యోగ కల్పనకు అవకాశం లేకుండా, ఉన్న వాటిని సైతం ప్రైవేటీకరిస్తుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వరంగ సంస్థలను, అడవులను కాపాడుకోనేందుకు, కార్మిక చట్టాలను పరిరక్షించుకొనేందుకు, ప్రజలు జీవించేహక్కు కోసం, ఆదివాసీలపై దాడులను ఆపివేయాలని, అటవీ చట్టాల అమలును డిమాండ్ చేస్తూ ఈనెల16న చేపట్టే దేశవ్యాప్తసమ్మెలో అన్నివర్గాల కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో

దంపతులకు తీవ్ర గాయాలు

జైపూర్, ఫిబ్రవరి 11: మండలంలోని వెలిశాల మల్లన్న ఆలయం మూల మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వేమనపల్లి మండలంలోని జాజుల పేటకు చెందిన దుర్గం ధర్మయ్య, అతని భార్య కళావతితో కలిసి బైక్‌పై మంచిర్యాలకు వస్తున్నారు. భీమారం మండలంలోని ఆరేపల్లికి చెందిన మరో బైక్ వెనక నుంచి ఢీకొట్టగా ధర్మయ్య, అతని భార్య కళావతి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ధర్మయ్యను కరీంనగర్‌కు తరలించారు. ధర్మయ్య నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉపేందర్ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు స్కూటీ దగ్ధం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 11: పట్టణంలోని సబ్‌స్టేషన్ ఎదుట ఆదివారం ప్రమాదవశాత్తు స్కూటీ దగ్ధమైంది. స్కూటీపై ఇద్దరు వ్యక్తులు సోమగూడెం వైపు వెళ్తుండగా అదుపు తప్పి కింద పడింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. స్కూటీ కింద పడడంతో స్కూటీపై ఉన్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్కూటీ దగ్ధమైన సమయంలో స్కూటీపై ఉన్న వారు పక్కకు పడడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

సీసీ రోడ్లకు భూమిపూజ



బెజ్జూరులో సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్

బెజ్జూరు, ఫిబ్రవరి 11: మండలకేంద్రంలో ఆదివారం సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.55 లక్షలతో మంజూరైన రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలత, శ్రీవర్ధన్, శంకర్, హకీం, హనుమంతు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలకేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన రూ.60 లక్షలతో సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో కనకయ్య, శేఖర్, శంకర్, వెంకన్న, ప్రవీణ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

జైనూర్, ఫిబ్రవరి 11: జైనూరుతోపాటు పరిసర ప్రాంతంలో దళారులు ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసు కుంటామని ఎస్‌ఐ సందీప్ హెచ్చరించారు. మండల కేంద్రంలో తనిఖీల్లో ఆదివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ సందీప్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను రవాణ చేసినట్లయితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామ పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు

నెన్నెల, ఫిబ్రవరి 11: ఇటీవల పదవీ విరమణ పొందిన గంగారం గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని ప్రజలు ఆదివారం సన్మానించారు. సర్పంచ్ కామెర సుధాశ్రీనివాస్, ఉప సర్పంచ్ దుర్కి నరేష్, వార్డు సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సహకరించిన పాలకవర్గానికి, అధికారులకు, ప్రజలకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యులు సంకె రాజశేఖర్, దుర్కి స్వప్న, దుగుట మల్లేశ్వరి, ఆకుదారి ప్రశాంత్, కస్తూరి శారద, పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి11: ఊరు మంద మర్రికి చెందిన మా ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అందిరికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కాంగ్రెస్ పార్టీజిల్లా పీసీసీ సభ్యుడు నూకల రమేష్ తెలిపారు. ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో సరుకుల పంపిణీకి హాజరై మాట్లాడారు. ఇబ్రహీం, ఫారెస్టు రిటైర్డ్ అధికారి మల్లయ్య, అధ్యక్షుడు పెద్ది లక్ష్మణ్, ముజాహిద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు, ఓనర్లను ఆదుకుంటాం



ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఏసీసీ, ఫిబ్రవరి 11: ఆటో డ్రైవర్లను, ఓనర్లను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కలెక్టర్ బదావత్ సంతోష్, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ పుప్పాల శ్రీనివాస్‌తో కలిసి నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లందరికి ఉచిత ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వస్తున్నందున ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ వర్తింపజేసే పథకాన్ని అనుకున్న దానికంటే ముందుగానే ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 3300 ఆటోలు ఉన్నాయని, ఇప్పటివరకు 1650 ఆటోలకు సంబంధించిన పత్రాలు అందించగా 350 ఆటోలకు సంబంధించిన పత్రాలు సరిగ్గా లేవన్నారు. మిగితా వారందరు పత్రాలు అందిస్తే ఇన్సూరెన్స్ వర్తింపజేస్తామన్నారు. తన సొంత నిధులతో ఒక్కో ఆటోకు రూ.8 వేల విలువైన ఇన్సూరెన్స్ పథకాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇన్సూరెన్స్ ద్వారా ఆటోను ఓనర్ నడుపుతూ ప్రమాదం జరిగితే రూ.15 లక్షలు క్లెయిం చేయవచ్చని, డ్రైవర్ నడుపుతూ ప్రమాదం జరిగితే రూ.2 లక్షల వరకు క్లెయిం చేయవచ్చని, ప్రయాణికులకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఇన్సూరెన్స్‌ను వినియోగించుకోవాలంటే ఆటో నడిపేవారికి లైసెన్స్, ఆటో ఫిట్‌నెస్, పర్మిట్ ఉండాలన్నారు. అధికారులతో మాట్లాడి ఆటో డ్రైవర్లకు ఉచితంగా లైసెన్స్‌లు అందించేందుకు ప్రణాళికలు చేపడతామన్నారు. లేబర్ డిపార్టుమెంటులో ఆటో డ్రైవర్లను సభ్యులుగా చేర్చడం ద్వారా ప్రమాదం జరిగినప్పుడు రూ.6 లక్షల వరకు పరిహారం పొందవచ్చన్నారు. తెల్లరేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు వైద్య సహాయం పొందవచ్చన్నారు. స్కూల్ ఫీజులో రూ. 12 వేల వరకు రాయితీ, ఉచిత విద్య వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, ఓనర్లకు ఏదైనా జరిగితే కుటుంబాలు నష్టపోతాయని గ్రహించి ఎమ్మెల్యే సొంత ఖర్చులతో ఇన్సూరెన్స్ చేయించడం, ఇందుకు దక్షత గ్రూఫ్ ఆఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. వేగంగా, అజాగ్రత్తగా, రాంగ్‌రూట్‌లో ఆటోలు నడపవద్దన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టు శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించవద్దని సూచించారు. ఆటోలకు గ్రీన్ టాక్స్ లేదని తెలిపారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య, దక్షత ఇన్సూరెన్స్ గ్రూపు చైర్మన్ సుధాకర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌లు రావుల ఉప్పలయ్య, సుర్మిళ్ల వేణు, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ వివేకానందరెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణాధ్యక్షుడు తూములనరేష్, వైస్‌చైర్మన్ సల్ల మహేష్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నరేందర్

లక్సెట్టిపేటరూరల్, ఫిబ్రవరి 11: వాహనాలు నడిపే వారు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని లక్సెట్టిపేట సీఐ నరేందర్ హెచ్చరించారు. పట్టణంలో రాష్ డ్రైవింగ్, వివిధ రకాల సైలెన్స్‌లను బిగించి వాహనాలు నడుతున్నవారిని ఆదివారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని, ఇస్తే మైనర్‌తో ఓనర్‌పై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రాష్ డ్రైవింగ్ చేసినా, భారీ శబ్దం వచ్చే సైలెన్సర్‌లను బిగించినా వాహనాను సీజ్ చేసి కోర్టుకు పంపిస్తామన్నారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు లక్ష్మణ్, రామయ్య , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత రంగారెడ్డి జట్టు



రంగారెడ్డి జట్టుకు బహుమతి అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 11 : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రంగారెడ్డి జట్టు విజేతగా నిలిచిందని జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు తెలిపారు. దివంగత ఏఆర్ డీఎస్పీ శశిధర్ స్మారక ఫుట్‌బాల్ పోటీలను ఆదివారం సీఐ మహేందర్‌రెడ్డి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో రంగారెడ్డి-కరీంనగర్ జట్లు తలపడగా రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు జెడ్పీ చైర్‌పర్సన్ బహుమతులు అందించారు. ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు అద్భుత ఆటతీరును ప్రదర్శించారని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను ఒకేలా తీసుకోవాలని, ఓడిన వారు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. విజేత జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. వరంగల్ సీఐ కిషన్, నిర్వాహకులు రేశ్ల శ్రీకాంత్,గుండ రమేష్,రాంవేణు, రాజనర్సు, బాబురావు, కరుణాకర్,సుమన్ పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : ఆర్యవైశ్యుల కుల దైవం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వనాథ ఆల యంలో వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి చీర, ఓడి బియ్యంను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో 102 గోత్రాల మహిళలతో 201 మంది మహిళలకు కుంకుమ పూజలను నిర్వహించారు. రాజేష్, చంద్రశేఖర్, శ్రీనివాస్,బాల మోహన్, చంద్రశేఖర్,ముకేష్, వంశీకృష్ణ,సతీష్, ప్రవీణ్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా చైతన్య రచనలు రావాలి

- ప్రొఫెసర్ హరగోపాల్,
ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎడిటర్ కె శ్రీనివాస్, ప్రొఫెసర్ హరగోపాల్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 11: ప్రజా చైతన్యం కోసం చావుకు సైతం సిద్ధపడిన రచనలు రావాలని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో క్యాతన్‌పల్లికి చెందిన రచయిత గురిజాల రవిందర్‌రావు రచించిన అగ్గి రవ్వలు పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. ఇలాంటి మరిన్ని రచనలు అవసరమని ఆయన తెలిపారు. విలువలతో కూడిన వ్యక్తుల రచనలను ఆదరించాలని, ఆ విలువలను జీవితంలో పాటించాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం పాలకవర్గాలు అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా చైతన్యపర్చడానికి వ్యక్తులు, మేధావులు ముందుకు రావాలన్నారు. ఒక రచన చేయడానికి రచయితకు ఎంతో శ్రమతో కూడుకున్న పని అని, ఆ రచనలను ప్రజలు చదివి ప్రభావితం అయినప్పుడే పుస్తకానికి, రచయితకు ఒక అర్థం ఉంటుందన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ ఫాసిస్టు విధానాల పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమాజ చైతన్యం చేసే విధంగా అద్భుతమైన రచనలతో పుస్తకాలు తీసుకువస్తున్నారని తెలిపారు. పుస్తక పఠనం తోనే ప్రతీ ఒక్కరికి మేధాశక్తి పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలోని తపాలా పూర్ సంఘటనను వివరించారు. ఉద్యమాలకు ఆదిలాబాద్ జిల్లా ఊపిరి ఊదిందని, దొరల దురహంకారానికి వ్యతిరేకంగా తిరగబడ్డ ప్రాంతమని ఆయన తెలిపారు. పుస్తక సమీక్షకు విద్యావంతుల వేదిక నాయకుడు రవిందర్ వ్యవహరించారు.

అర్జున్‌రావు వర్ధంతి

ఏసీసీ, ఫిబ్రవరి 11: మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు స్వర్గీయ ముత్తినేని అర్జున్‌రావు వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. అర్జున్‌రావు చిత్రపటానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్జున్‌రావు మున్సిపల్ చైర్మన్‌గా మంచిర్యాల పట్టణ అభివృద్ధికి, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించారన్నారు. అత్తి సరోజ, ముత్తినేని రవికుమార్, గజ్జల హేమలత, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, చిట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేయాలి

జైపూర్, ఫిబ్రవరి 11 : బీఆర్ఎస్ పార్టీ దళిత మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి అవమానపర్చిన అగ్రవర్ణ కాంగ్రెస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకులు మేడి తిరుపతి ఆధ్వర్యంలో ఆదివారం ఏఎస్ఐ ఇజాజ్‌కు ఫిర్యాదు చేశారు. బాల్క సుమన్‌ను ఇలా అవమానించడం సరైంది కాదని, వెంటనే కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేయాలని కోరారు.

ఘనంగా అరుణ హోమం

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 11: పట్టణంలోని బాలేశ్వర ఆలయంలో రథసమప్తమి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. 12న ఏకాదశ రుద్రాభిషేకం, 13న చండీ సప్తశతి హవనం, 14న కుంకుమార్చన, 15న సహస్రపుష్పార్చన, 6న బాలేశ్వరస్వామి రథోత్సవం, 17న మహాపూర్ణాహుతితో నవరాత్రి ఉత్సవాలు ముగించనున్నట్లు ఆలయ అర్చకుడు పేర్కొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

● సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 11: ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కాగజ్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసి, కార్పొరేట్ రంగానికి ఊడిగం చేస్తోందన్నారు. కనీస వేతనాలు పెంచటం లేదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా ఉందన్నారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు అన్ని సంఘాలతో ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమం చేపడుతున్నట్లు, విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శులు జాదవ్ రాజేందర్, ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు త్రివేణి, శ్రీకాంత్, కృష్ణమాచారి, శ్యాంరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించాలి..

ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించేలా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక శాఖ అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని సాయిబాబుకు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు.

అటవీక్షేత్రంలో పర్యటించిన ట్రైనీ ఆఫీసర్స్



అధికారులకు అవగాహన కల్పిస్తున్న కోర్సు డైరెక్టర్ రామ్మోహన్

బెజ్జూరు, ఫిబ్రవరి 11: హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్టుఅకాడమీకి చెందిన 22మంది శిక్షణపొందుతున్న సెక్షన్ అధికారులు ఆదివారం అటవీక్షేత్ర పర్యటన చేశారు. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. కుశ్నపల్లి సెక్షన్‌పరిధిలోని ఇందూర్‌గాం బీట్‌లో అటవీరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాముడు భీముడు టేకుచెట్లు, గడ్డిమైదానాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ అటవీప్రాంతంలోని వన్యప్రాణులతోపాటు జీవవైవిద్యంపై తెలుసుకున్నారు. అదేవిధంగా ఇక్కడి అటవీశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వాటిరక్షణ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రథమ ర్యాంకర్‌కు సన్మానం



శివకృష్ణ, తల్లిదండ్రులను సన్మానిస్తున్న శిశుమందిర్ అచార్యులు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 11: టీఎస్‌పీఎస్సీ తాజాగాప్రకటించిన గ్రూప్-4పరీక్షలో రాష్ట్ర ప్రథమర్యాంకు సాధించిన జిల్లాకు చెందిన శ్రీరామ్ శివకృష్ణను ఆదివారం పలువురు సన్మానించారు. పదవ తరగతి వరకు స్థానిక శిశుమందిర్‌లో విద్యనభ్యసించగా పాఠశాలకమిటీ సభ్యులు శివకృష, అతని తల్లితండ్రులను ఘనంగా సన్మానించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ కూడా సన్మానించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, శశి, వెంకన్న, కృష్ణమూర్తి, వెన్న, కృష్ణమాచార్యులు, సంతోష్, హరిప్రియ, వెంకటేశ్వర్లు, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల రిమాండ్

దహెగాం, ఫిబ్రవరి 11: మండలంలోని ఇట్యాల సమీపంలోని విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ, అయిల్ దొంగలించారని రైతులు ఫిర్యాదుచేయడంతో ముగ్గురిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సైవివరాల ప్రకారం.. గతనెల 26నఇట్యాల గ్రామరైతు సందేల భగవంత్, ఈనెల6న విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులో భాగంగా మంచిర్యాలజిల్లా భీమిని మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన డోంగ్రె శ్రీను, గాదెసతీష్, దహెగాంమండలం బోర్లకుంటకుచెందిన రవీందర్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు, వంతెనను త్వరగా పూర్తిచేయాలి

వాంకిడి, ఫిబ్రవరి 11: మండలంలోని బంబార, గోండుకోసార, పిప్పర్‌గొంది, చౌపన్‌గూడ, ఖిరిడి, ఎనోలి, సామెల, మహాగావ్, నవేగాం, ఖమాన, రాజీవ్‌నగర్ గ్రామాల్లో ఐటీడీఏ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీశాఖల ద్వారా మంజూరైన టెండరు పూర్తైన బీటీరోడ్లు, వంతెనపనులను పూర్తి చేయాలని జడ్పీటీసీ అజయ్‌కుమార్ కోరారు. నిధులు మంజూరై రోజులు గడుస్తున్నాయన్నారు. అధికారులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్‌లుపాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బెజ్జూరు, ఫిబ్రవరి 11: మండలంలో ఆదివారం ఎస్సై విక్రం వేర్వేరుగా చేసిన దాడుల్లో 30క్వింటాళ్ల రేషన్‌బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. బెజ్జూరుకుచెందిన నౌషాద్ అనే వ్యక్తి 20క్వింటాళ్ల బియ్యం మహారాష్ట్రకు తరలించేందుకు మొగవెల్లి గ్రామంలో ఒకరి ఇంట్లో నిలువఉంచగా స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎల్కపల్లిలో కేశెట్టి శ్రీనివాస్ కిరాణ దుకాణంలో తనిఖీచేయగా 10క్వింటాళ్ల బియ్యం పట్టుబడడంతో ఇద్దరిపై కేసు నమోదుచేసి బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

కౌటాల, ఫిబ్రవరి 11: మండలంలోని బాదంపల్లి గ్రామానికిచెందిన కొండ స్వామి (22) మద్యంమత్తులో ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్ప డినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్వామి నిత్యం మద్యం తాగుతూ పనిపాట లేకుండా తిరగడంతో తల్లి మందలించింది. దీంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు.

జంగోలింగో దీక్షతో నా జన్మ ధన్యమైంది

● ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్



దీక్ష విరమణ చేస్తున్న ఎంపీ సోయం బాపూరావ్

జైనూర్, ఫిబ్రవరి 11: ఆదివాసుల ఆరాధ్యదైవం జంగో లింగో దీక్ష స్వీకరణతో తన జన్మ ధన్యమైందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండలంలోని జంగాం జంగోలింగో పుణ్యక్షేత్రంలో భక్తులు జంగోలింగో దీక్షలను ఆదివారం విరమించారు. ఈ సందర్భంగా జంగోలింగో దీక్ష తీసుకున్న ఎంపీ సోయం బాపూరావ్ కూడా దీక్షను విరమించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీ సోయం బాపూరావ్ మాట్లాడుతూ పవిత్ర పుష్యమాసంలో నియమ నిబంధనలతో సంప్రదాయబద్ధంగా పూజలు చేసుకుంటు దేవుళ్లను ఆరాధిస్తామన్నారు. ముఖ్యంగా ఆదివాసులు విద్యా వంతులు కావాలని సూచించారు. జంగోలింగో దీక్ష తీసుకున్న భక్తులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జంగోలింగో ఘన సంస్థాన్ అధ్యక్షుడు ఆత్రం రఘునాథ్, ప్రధానకార్యదర్శి గేడాం జగ్జీవన్, కార్యదర్శి ఆత్రం భగ్వంత్‌రావ్, ప్రచార కార్యదర్శులు ఉర్వేతమోహన్, కోట్నాక మోహపత్‌రావ్, ఆత్రం దత్తు, సర్పంచ్ కుంరం శ్యాంరావ్, భక్తులు పాల్గొన్నారు.

లాహిరి లాహిరి 'లహరి'లో..

ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌నగర్ మీదుగా లహరి బస్సు ప్రారంభం

● హైదరాబాద్‌కు సీటర్ కం స్లీపర్ కోచ్

● అధునాతన హంగులతో ఏసీ స్లీపర్ కోచ్



కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 11: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి కాగజ్‌నగర్ మీదుగా ప్రజల సౌకర్యార్థం లహరి స్లీపర్ బస్సులను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చింది. స్థానిక డిపోకు ఇటీవల 2 ఏసీ బస్సులు ప్రభుత్వం కేటాయించింది. హైదరాబాద్ ఎంజీబీఎస్ స్టేషన్ నుంచి కాగజ్‌నగర్ మీదుగా ఆసిఫాబాద్‌కు ప్రతీరోజు రెండు బస్సులను నడిపిస్తున్నారు. ప్రతినిత్యం రైళ్ల ఆలస్యంగా నడుస్తుండడంతో బస్సుల ప్రయాణం వైపు ప్రయాణికులు మొగ్గు చూపుతున్నారు. దూరప్రాంతం ప్రయాణాలు చేసే వారికి ఈ బస్సులు అనువుగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. బస్సులో కూర్చుని ప్రయాణించే సీట్లు 33ఉండగా పైన స్లీపర్ బెర్తులు 15ఉన్నాయి. కూర్చునే, పడుకొనే సీట్ల మధ్య ధరల మధ్య వ్యత్యాసం ఉంది. తొలిసారిగా లహరి ఏసీ బస్సు స్లీపర్ కోచ్‌తో ప్రారంభించడంతో మంచి డిమాండ్ వస్తోంది. లహరి బస్సుల మంజూరుతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జెండా ఊపి లహరి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ చైర్మన్, కలెక్టర్ (ఫైల్)

● తొలిసారి కాగజ్‌నగర్ నుంచి స్లీపర్ బస్సు..

గతంలో కేవలం రైళ్ల ద్వారానే స్లీపర్ కోచ్‌లో ప్రయాణించే వీలుండేది. కానీ ప్రస్తుతం అన్ని హంగులతో కూడిన ఏసీ స్లీపర్ బస్సులు జిల్లాకు రావడంతో ప్రయాణికులు టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు. హైదరాబాద్‌కు తొలిసారి కాగజ్‌నగర్ నుంచి స్లీపర్ బస్సు నడిపిస్తుండడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆసిఫాబాద్ నుంచి నూతనంగా 2లహరి బస్సులు ప్రారంభించారు. ఒకటి ఆసిఫాబాద్ నుంచి హైద్రాబాద్‌కు ఉదయం 9-30 బయలు దేరుతుంది. అలాగే మళ్లీ రాత్రి హైద్రాబాద్‌లో 9-15 బయలుదేరి ఆసిఫాబాద్‌కు ఉదయం 9గంటలకు చేరు కుంటుంది. స్లీపర్ బస్సు హైదరాబాద్‌కు రూ.850, స్లీపర్ రూ.1180గా ధరలు నిర్ణయించారు. ఈ బస్సులకు ఆన్‌లైన్ టికెట్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంది. టీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్ సేవల ద్వారా టికెట్ బుక్ చేసుకోవచ్చని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ తెలిపారు. రాత్రి ఆసిఫాబాద్ నుంచి బయలుదేరే బస్సు కాగజ్‌నగర్, రెబ్బెన, తాండూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, గోదావరిఖని మీదుగా హైదరాబాద్ వరకు వెళుతుంది. అలాగే హైదరాబాద్ నుంచి రాత్రి బయలు దేరే బస్సు మాత్రమే ఎంజీబీఎస్, జేబీస్, కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, కాగజ్‌నగర్ మీదుగా ఆసిఫాబాద్ వరకు నడుస్తుంది. రెండు బస్సుల్లో రాత్రి పూట నడిచే బస్సులు కాగజ్‌నగర్ మీదుగా నడుస్తాయని మిగిలిన రెండు ఆసిఫాబాద్ నుంచి డైరెక్ట్‌గా హైదరాబాద్ వెళతాయని డీఎం వివరించారు.

ASIFABAD DEPOT

LAHARI A/C SLEEPER CUM SEATER

ASF TO MGBS			MGBS TO ASF		
OPRS Codes	DAY 8052	9T 8054	OPRS Codes	DAY 8055	9T 8053
ASIFABAD	09:30	21:15	MGBS	09:00	20:30
KZNR	******	22:00	JBS	09:45	21:15
REBBANA	10:00	22:30	KRMR	12:35	00:10
IB TANDUR	10:15	22:45	PDPL	13:20	00:45
BPL	10:30	23:00	GDK	13:55	01:30
MDMR	10:45	23:20	MNCL	14:30	02:00
MNCL	11:00	23:50	MDMR	14:45	02:15
GDK	11:30	00:40	BPL	14:55	02:30
PDPL	12:15	01:40	IB TANDUR	15:05	02:45
KRMR	13:00	02:40	REBBANA	15:25	03:00
JBS	16:30	04:45	KZNR	*****	03:30
MGBS	17:00	05:15	ASIFABAD	15:40	04:00
Seater : 850 Rs/-			Sleeper:1180 Rs/-		



లహరి బస్సు లోపల పరిశీలిస్తున్న కలెక్టర్

లహరి బస్సును సద్వినియోగం చేసుకువాలి..

- శ్రీధర్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆసిఫాబాద్



హైదరాబాద్‌కు నడిపిస్తున్న లహరి బస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. రాత్రిపూట నడిచే బస్సులు మాత్రమే ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌నగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లనున్నాయి. ముందస్తుగా టీఎస్‌ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునే వీలుంది. ఆసిఫాబాద్ నుంచి ఉదయం 9.30కు, రాత్రి 9.15కు, హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు ఉదయం 9.00కి, రాత్రి 8.30కు లహరి బస్సులు అందుబాటులో ఉంటాయి.

జిల్లాలో ఎనిమిది మంది ఎంపీడీవోల బదిలీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎనిమిది మంది ఎంపీడీవో లను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీఅయిన వారిలో ఎంపీడీవోలు సత్యనారాయణసింగ్, శ్రీనివాస్, సత్యనారాయణ, మహేందర్, మధుసూదన్, రాజేశ్వర్, శశికళ, ప్రసాద్ ఉన్నారు. వీరిస్థానంలో మంచిర్యాల జిల్లా నుంచి ప్రవీణ్ కుమార్, వరలక్ష్మి, శంకరమ్మ, మల్లేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజేందర్, మహబూబ్‌నగర్ నుంచి కృష్ణారావు జిల్లాకు రానున్నారు.

ప్రశాంతంగా వీటీజీ సెట్



సిర్పూర్(టి)లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11: గిరిజన గురుకుల పాఠశాలల్లో, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వతరగతిలో ప్రవేశంకోసం ఆదివారం జిల్లాలో నిర్వహించిన వీటీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కోఆర్డినేటర్ బాలరాజు తెలిపారు. జిల్లాలో మొత్తం 9సెంటర్లను ఏర్పాటు చేయగా వీటిలో 2782 మందికి గాను 2367 మంది హాజరు కాగా 415 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, ఆర్సీవో స్వరూపరాణి తనిఖీ చేశారు.

సిర్పూర్(టి): మండలంలో ఆదివారం నిర్వహించిన వీటీజీసెట్‌కు మొత్తం 912మందికిగాను 854మంది విద్యార్థులు హాజరయినట్లు జిల్లా కోఆర్డినేటర్ పోలోజు బాలరాజు తెలిపారు.

నాగోబా జాతర సందర్భంగా నేడు సెలవు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11: ఆదిలాబాద్ జిల్లాలో జరుగనున్న నాగోబా సందర్భంగా నేడు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సెలవుకు బదులుగా మార్చిలో రెండోశనివారం విద్యాసంస్థలు కొనసాగుతాయన్నారు. ఇంటర్మీడియట్ విద్యాసంస్థలకు పరీక్షలు నడుస్తున్న నేపథ్యంలో సెలవు నుంచి మినహాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి స్మగ్లర్లపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11: జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగా గంజాయి స్మగ్లింగ్ జరుగుతోందని డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. యువతను టార్గెట్ చేస్తూ ప్రతిగ్రామంలో కొంతమంది స్మగ్లర్లు మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకు వస్తున్నారని దానిని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. గంజాయి స్మగ్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు టికానంద్, కార్తీక్, రాజ్‌కుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ పూజలు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 11: పట్టణంలోని పెద్దవాగుసమీపంలో గల సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తమ నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) తూకం వేశారు. పెద్దసంఖ్యలో తల్లుల దర్శనం చేసుకోవడంతో ఆ ప్రాంత మంతా కోలాహలంగా మారింది.

శివాజీ స్ఫూర్తితో ధర్మ పరిరక్షణకు పాటుపడుదాం

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 11: ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ధర్మ పరిరక్షణకు పాటుపడదామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని నవేగాం గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైందవ ధర్మపరిరక్షణ కోసం శివాజీ మహారాజ్ చేసిన పోరాటం మనందరికీ చిరస్మరణీయమని అన్నారు. ఆరెకుల అభివృద్ధికోసం పాటుపడుతామని, వారికి కేంద్రప్ర భుత్వం తర్వలోనే ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వనుంద న్నారు. అలాగే కాగజ్‌నగర్ పట్టణంలో కూడా పెద్దఎత్తున శివాజీ మహారాజ్ విగ్రహాన్ని నెలకొల్పు తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శంకర్, సత్యనారాయణ, ఆరె సంఘం నాయకులు కిశోర్ పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్: మహారాష్ట్రలోని దాబా వద్ద గల కొండయ్య మహారాజ్ సమాధిని ఆదివారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దాబా కమిటీ వారు సిర్పూరు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సన్మానం చేశారు.



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

భక్తజన సంద్రమైన అనార్‌పల్లి

కెరమెరి, ఫిబ్రవరి 11: మండలంలో జరుగుతున్న అనార్‌పల్లి వేంకటేశ్వరస్వామి జాతర ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఉమ్మడిజిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. టీటీడీ అర్చకులు, వేదపండితులు సంతోష్‌శర్మ స్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో రథాన్ని ఊరేగించారు. జాతరకు తరలివచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేషారావు రాథోడ్, శంకర్‌నాయక్, రాందాస్, తిరుపతి, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్ వెల్ డే



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 11: కాగజ్‌నగర్ వివేకానంద జూనియర్ కళాశాలలో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఫేర్ వెల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హనుక్ మాట్లాడుతూ రానున్న వార్షిక పరీక్షల్లో విద్యార్థులు చక్కటి ర్యాంకులు సాధించి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు పలు పాటలపై డ్యాన్సులు చేశారు.

అటవీశాఖ భవన నిర్మాణపనులను అడ్డుకున్న గ్రామస్థులు



గుంతలను పూడ్చి వేస్తున్న గ్రామస్థులు

పెంచికలపేట, ఫిబ్రవరి 11: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో అటవీఅధికారులు, గ్రామస్థుల మధ్య ఆదివారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామశివారులోని స్థలంలో మంజూరైన మండల అటవీకార్యాలయ భవన నిర్మాణానికి అధికారులు పనులు ప్రారంభించారు. ఆ సంస్థలో పనులు చేపట్టవద్దని గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈస్థలాన్ని గతంలో శ్మశానవాటికకు ఉపయోగించామని, ప్రస్తుతంఇక్కడ ఆటస్థలం కేటాయించారని గ్రామస్థులు పేర్కొన్నారు. భవనం కోసం తీసిన గుంతలను పూడ్చే ప్రయత్నం చేశారు. ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ మాట్లాడుతూ ఈభూమి పూర్తిగా అటవీశాఖపరమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై తహసీల్దార్ వెంక టేశ్వరరావును వివరణకోరగా సర్వేనం.61లోగల వివాదాస్పదస్థలాన్ని త్వరలోనే సర్వేచేయిస్తామన్నారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గఇన్‌చార్జి రావిశ్రీనివాస్ సంఘటనస్థలానికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు.



దేశవ్యాప్త సమ్మెపై సీఐటీయూ ప్రచారం

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం అనురిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగాచేపట్టిన ఒక్కరోజుదేశవ్యాప్త సమ్మెపై సీఐటీయూ నాయకులు విస్తృతంగాప్రచారం చేస్తున్నారు. ఏరియాలోని గనుల, డిపార్టుమెంట్ల వద్దకువెళ్లి సమ్మె గురించి కార్మికులకు తెలియ జేస్తున్నారు. గేట్‌మీటింగ్‌లు పెట్టి రానున్నరోజుల్లో బొగ్గు పరిశ్రమలతో పాటు బొగ్గు ఆధారిత పరి శ్రమల పరిస్థితి కూడా దారుణంగా ఉండబోతుందని, భవిష్యత్‌లో కార్మికుల ఉద్యోగ భద్రత ఉండదని ప్రచారం చేస్తున్నారు. ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సమ్మె అని వారు పేర్కొన్నారు. దేశంలో మూడోసారి మోదీ గెలిస్తే రానున్న రోజుల్లో ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. ఈసమ్మెకు సంబంధించి త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

కార్మికులు కదం తొక్కండి..

దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల16న తలపెట్టిన సమ్మెకు సింగరేణికార్మికులు కదం తొక్కుతారని గుర్తింపుసంఘం బ్రాంచికార్యదర్శి సలేంద్రసత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ సమ్మెకు అదానీ అంబానీలకు ఆస్తులు పెంచడం తప్ప మోదీ ప్రభుత్వం చేస్తున్నది ఏమిటని ప్రశ్నించారు. సమ్మె విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గాండ్ల సంపత్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీ క్రికెట్ లీగ్ విజేత సోలార్ ఎనర్జీ జట్టు

జైపూర్, ఫిబ్రవరి 11: ఎస్టీపీపీలో 11రోజుల పాటు జరిగిన క్రికెట్ లీగ్‌సీజన్ 10మ్యాచ్ ఆదివారంముగిసింది. ఫైనల్‌మ్యాచ్‌లో సోలార్ ఎనర్జీ జట్టు, పవర్‌మేక్ గేమ్ చేంజర్స్ జట్టు తలపడగా సోలార్ ఎనర్జీ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఎస్టీపీపీ ఈడీబసివిరెడ్డి ట్రోఫీ, అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ విజయవంతంగా క్రికెట్ టోర్నీని నిర్వహించిన చీఫ్‌ఆర్గనైజర్ పంతులను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు సింగ్, శ్రీనివాస్, సుబ్బారావు, అఖిల్, శ్రీనివాస్, సింగ్, ఏఎస్‌సింగ్, బ్రహ్మం పాల్గొన్నారు.

కార్మికుడి ఆత్మహత్యాయత్నం

● ఏఐటీయూసీ కారణమని యూనియన్ల ఆరోపణ

● ఖండించిన ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 11: శ్రీరాంపూర్‌లోని ఎస్‌ఆర్పీ1గనికి చెందిన జనరల్ మజ్దూర్‌కార్మికుడు కొట్టె వెంకటేష్ ఆదివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. తనను లక్ష్యంగా చేసుకొని వేధించడంతోనే ఈ ఘాతుకానికి పాల్పడాల్సి వచ్చిందని బాధితుడు తెలిపాడు. ఆయన కథనం ప్రకారం... తాను ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నానన్నాడు. ఇటీవల తనతో పాటు పదిమందిని షిఫ్టుల్లోకి మార్చారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీకి వ్యతిరేకంగా పనిచేయడం తోనే తనపై కక్షగట్టి మార్చారని ఆయన పేర్కొన్నాడు. దీంతోనే ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో హెయిర్‌డై తాగానన్నాడు. వెంటనే అతడి స్నేహితులు స్పందించి మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్

బాధితుడికి పరామర్శ..

బాధిడుతు వెంకటేష్‌ను సీఐటీయూ ఉపాధ్యక్షుడు కస్తూరి సుధాకర్, ఎస్‌ఆర్పీ1 పిట్ కార్యదర్శి తోడే సుధాకర్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీనియర్లస్థానంలో జూనియర్లను నియమిస్తూ సీనియర్లను షిఫ్టులలో వేస్తామని ఏఐటీయూసీ నాయకులు బెదిరింపులకు గురిచేస్తున్నార న్నారు. కొంతమందిని డిపార్ట్‌మెంట్ల నుంచి షిఫ్టులలోకి మార్చారని ఆరోపించారు. ఈ విషయంపై జీఎంకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

నిరాధార ఆరోపణలు..

తమ యూనియన్‌పై ఇతర యూనియన్ల నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్‌కార్యదర్శి దాడి రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధితుడు కొట్టె వెంకటేష్ తనను షిఫ్టుల్లోకి మార్చారని ఆందోళన చెంది ఆత్మహత్యాయత్నం చేయడం తమను బాధించిందన్నారు.

ఘనంగా సింగరేణి పాఠశాల వార్షికోత్సవం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 11: సీసీసీలోని సింగరేణి పాఠశాల 46వవార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జీఎం బి సంజీవరెడ్డి, సేవాఅధ్యక్షురాలు రాధాకుమారి హాజరయ్యారు. రూ.5లక్షల వ్యయంతో సింగరేణి యాజమాన్యం ఏర్పాటుచేసిన మినీ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. క్రీడల్లో విజేతలైన విద్యార్థులకుబహుమతులు ప్రదానం చేశారు. సింగరేణిపాఠశాల 46సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌వోటుజీఎం రఘుకుమార్, సలీమణిలక్ష్మీపాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, హెచ్‌ఎం ఆర్ రాధాకృష్ణమూర్తి, ఆర్‌విష్ణువర్ధన్‌రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాసదస్సును విజయవంతం చేయండి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11: ఈనెల 13న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎంగార్డెన్స్‌లో నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ విద్యాసదస్సును విజయవంతం చేయాలని ఆసంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానికంగా జిల్లా ప్రధానకార్యదర్శి ఇందురావ్ మాట్లాడుతూ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, డీఈవోఅశోక్, డీటీడీవోరమాదేవి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్లయ్య, హేమంత్, రమేష్, ఊశన్న, నవీన్ కుమార్, బాదిరావు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయంలో ఉదయం వాసవీమాతకు పంచామృతాలతో అభిషేకం చేసి పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు వంకర్, ఆదిత్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.